పల్లెల్లో సారా ఘాటు!

- యథేచ్ఛగా అమ్మకాలు
- కూటమి నాయకుల అండతో రెచ్చిపోతున్న వ్యాపారులు
- ఎక్కడ చూసినా సారా ప్యాకెట్లు దర్శనం

ఇచ్ఛాపురం రూరల్: పల్లెల్లో మంచినీరు కంటే నాటుసారా పుష్కలంగా దొరుకుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సారా అమ్మకాలు జోరందుకున్నాయి. ఆ పార్టీల నాయకుల అండతో ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఫోన్ కొడితే చాలు క్షణాల్లో సారా ప్యాకెట్లను డోర్‌డెలివరీ చేస్తున్నారు. పట్టపగలే జనవాసాల మధ్యనే సారా యథేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రా-ఒడిశా గ్రామాల ద్వారా రవాణా..

ఇచ్ఛాపురం మండలానికి సారా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలు మీదుగా యథేచ్ఛగా రవాణా అవుతోంది. ఇచ్ఛాపురం మండలం పరిధిలోని జగన్నాథపురం, టి.బరంపురం, బిర్లంగి, మశాఖపురం, బొడ్డబడ, కొళిగాం, కేదారిపురం, ముచ్చింద్ర, లక్ష్మీపురం, మండపల్లి, డొంకూరు, ఇన్నేశుపేట, లండపుట్టుగ, బలరాంపురం, కవిటి మండలం పరిధిలో ఆర్.కరాపాడు, కొజ్జిరియా, గొర్లెపాడు, కమాలాయిపుట్టుగ, జమేదారిపుట్టుగ, మంగళవారం సంత, కంచిలి మండలం జాడుపూడి ఆర్.ఎస్, జె.బైరిపురం, నారాయణపురం, పోలేరు, సోంపేట మండలానికి సంబంధించి మందస మండలం గిరిజన గ్రామాల గుండా నియోజకవర్గంలోకి రాత్రి సమయాల్లో వ్యాపారుల వద్దకు తీసుకువస్తున్నారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఒడిశా స్వర్ణాపురం ప్రాంతం నుంచి సముద్రం మీదుగా నాటు పడవల్లో సారా మత్స్యకార గ్రామాల్లోకి రవాణా అవుతోంది.


నాటుసారా ప్యాకెట్లతో ఇచ్ఛాపురం రూరల్ పోలీసులకు చిక్కిన టీడీపీ కార్యకర్త(ఫైల్)

దాడులు చేసినా ఆగని జోరు

ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు విక్రేతలపై అడపాదడపా దాడులు చేస్తున్నా పల్లెల్లో నాటు సారా జోరు తగ్గడం లేదు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నా వారం రోజుల వ్యవధిలో బయటకు వచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల బ్రాందీ షాపులు మంజూరు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన షాపులు పట్టణ ప్రాంతాలకు దరిదాపుల్లో, ఒకే గ్రామంలో ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాల నుంచి రాలేనటువంటి మద్యం ప్రియులు సారాను ఆశ్రయిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో రోడ్ల వెంట, పంట పొలాలు, నదులు, చెరువులు, వంతెనలు, బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడేసారా ఖాళీ ప్యాకెట్ల కవర్లు దర్శనమిస్తున్నాయి.


కొళిగాం చెత్త సంపద కేంద్రం వద్ద తాగేసి పడేసిన సారా ప్యాకెట్ కవర్లు

దాడులు చేస్తునే ఉన్నాం



ఒడిశా నుంచి సారా ఆంధ్రాలో ప్రవేశించకుండా నిఘా పెడుతూ దాడులు జరుపుతున్నాం. ఈ ఏడాది మే నెల నుంచి ఇప్పటి వరకు 84 కేసులు నమోదు చేయడం జరిగింది. అలాగే మద్యం బెల్టు షాపులు ఉంటే కేసులు పెడుతున్నాం. మా సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది కూడా సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

– పి.డి.ప్రసాద్, ఎక్సైజ్ సీఐ, ఇచ్ఛాపురం

● ప్రమాదాలకు హేతువుగా..



టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి పాత జాతీయ రహదారిలో పశువులు రోడ్డుకు అడ్డంగా ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. ఇటీవల గో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ పశువులు మాత్రం రోడ్డుకు అడ్డంగా వాహనదారులకు ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి రోడ్డుకు అడ్డంగా పశువులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – టెక్కలి

● తీరం కళకళ




వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మూడురోజుల తరువాత వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఒడిశా రాష్ట్రంలో పలు గ్రామాలతో పాటు టెక్కలిపట్నం, గొప్పిలి, కాశీబుగ్గ, పలాస పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో తీరానికి వచ్చి సందడి చేశారు. ఇక్కడ ఉన్న తోటలో సహపంక్తి భోజనాలు చేశారు. బీచ్‌లో ఆట,పాటలతో ఆనందంగా గడిపారు. సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగకుండా పోలీసులు అప్రమత్తం చేసారు. – వజ్రపుకొత్తూరు రూరల్

● భవానీ భక్తుల సందడి..



సంతబొమ్మాళి మండలం నౌపడ పాలపోలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో భవానీస్వాములు ఇరుముడి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గురుభవానీ పోకడ నగేష్ శర్మ, రాజా ఆధ్వర్యంలో అధికసంఖ్యలో భవానీలు ఇరుముడిని స్వీకరించారు. 41 రోజులు దీక్షను చేపట్టి విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో దీక్షను విరమించనున్నారు. ఇరుముడి కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. – సంతబొమ్మాళి

● కాలుష్య కోరల్లో..



వజ్రపుకొత్తూరు మండలం పూండి వ్యాపార కేంద్రం కాలుష్య కోరల్లో చిక్కుంది. హోటళ్లు, స్వీట్స్, సమోసా దుకాణాల యజమానులు వాటి తయారీ కోసం జీడిపిక్కల తొక్కను వినియోగిస్తున్నారు. దీంతో దీనితో వస్తున్న పొగతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. చిమ్నీలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ వాటిద్వారా వస్తున్న పొగ కాలుష్యాన్ని వెదజలుతోంది. అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు సైని భాస్కరరావు, యోగి, రమేష్, అరుణ, భారతి, మన్మథరావు తదితరులు కోరారు. – వజ్రపుకొత్తూరు

క్లుప్తంగా

క్షతగాత్రునికి పరామర్శ


అభియాదవ్‌ను పరామర్శిస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని గుర్రు అభి యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బాధితుడ్ని ఆదివారం పరామర్శించారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, మద్దు అభియాదవ్ ఉన్నారు.

శారదామాతకు పూజలు


లలితా సహస్రనామ పారాయణంలో మహిళలు

కాశీబుగ్గ: కాశీబుగ్గ శారదానగర్‌లోని శారదా పీఠంలో ఆదివారం శారదామాత 172వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవివేకానంద రామక్రిష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలుజరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

జాగ్రత్తలపై పర్యాటకులకు అవగాహన


పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ పోలీసు అధికారులు

సోంపేట: సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని మెరైన్ పోలీసు అధికారులు సూచించారు. బారువ సముద్రతీరానికి ఆదివారం వచ్చిన పర్యాటకులతో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బ్రాహ్మణతర్లాలో క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా గ్రామంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న చర్చి సమీపంలో దేవుని బిడ్డల ప్రత్యేకమైన కలయికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్, బిషప్ బీఎస్‌వీఎస్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై దేవుని వ్యాఖ్యాలను అందించారు.

ఆధ్యాత్మికమార్గం అనుసరణీయం


పూజలు చేస్తున్న భక్తులు

సోంపేట: ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని సోంపేట రామకృష్ణసేవాసమితి కార్యదర్శి జి.శంకరరావు అన్నారు. సేవాసమితి మందిరంలో శారదాదేవి 272వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం, దుర్గా సహస్రనామ పారాయణం, భజనలు జరిగాయి. భక్తులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సమితి ప్రతినిధులు కె.వేణు, ఎం.అప్పారావు, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: బుడ్డేపుపేట గ్రామానికి చెందిన బుడ్డేపు మోహనరావు మెదడు సంబంధిత వ్యాధితో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్సకు రూ.12 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బెల్లుపడకు చెందిన సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ సభ్యులు స్పందించారు. రూ. పదివేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మోహనరావు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

విద్యాభివృద్ధికి కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేటలోని కేజీబీవీలో సుమారు 1.10 కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన అదనపు తరగతి భవనాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, యోగా అభ్యసనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పాఠశాలకు ఆనుకుని పక్కనే ఉన్న స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పాఠశాలలో అదనపు డార్మెటరీలను నిర్మిస్తామని చెప్పారు. విద్యార్థులకు అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో విద్యను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో తిరుమలచైతన్య, సర్వశిక్షా ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణమూర్తి, ఏఈ రమానాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి, స్థానిక నాయకులు కె.హరివరప్రసాద్, వి.విజయలక్ష్మి, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అదనపు భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కాశీబుగ్గ సీతారామ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇన్ఫోసిస్, ఎడుబిడ్డి వారిచే 15 రోజులు శిక్షణ అందించి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ చదివిన 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్కులు దరఖాస్తు చేసుకోవానికి అర్హులన్నారు. ఆసక్తి ఉన్న 8074025714 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతులకు పరిహారం అందజేయాలి

టెక్కలి: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు జె.పరమేశ్వర్, లింగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలి మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. వరి, అపరాలు నష్టపోయిన రైతులను పరిహారం అందజేసే విధంగా సర్వే చేయాలని కోరారు.

24 మద్యం బాటిళ్ల స్వాధీనం

సోంపేట: మండలంలోని చౌకుపేటలో మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న కదంబాల పూర్ణ చంద్రరావును అరెస్టు చేసినట్టు బారువ ఎస్సై హరిబాబునాయుడు ఆదివారం తెలిపారు. ఇతని వద్ద నుంచి 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చి'వరి'కి నష్టమే మిగిలింది..!

- నీటిలో తేలుతున్న వరి ఓవులు


కంచిలి: కర్తలిలో నీటిలో తేలుతున్న వరి ఓవులు


కంచిలి: గోకర్ణపురంలో వరి కుప్ప చుట్టూ చేరిన నీటిని మళ్లిస్తున్న మహిళా రైతు


సోంపేట: పలాసపురంలో నీటిలో ఉన్న వరి చేను


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కంచిలి: అకాల వర్షం వరి రైతుకు తీవ్రనష్టాన్ని మిగిల్చింది. మూడు రోజులు కురిసిన వర్షానికి వరిచేను నీట మునిగింది. చేతికొచ్చిన పంట కళ్ల ముందే నీళ్ల పాలవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన వరి ఓవులు నీటిలో నానడంతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. తమ కష్టం నీటిపాలయిందని ఆవేదన చెందుతున్నారు. కల్లాల్లో నుంచి తరలించాలంటే పొలంలో నీళ్లు ఎటూ వెళ్లకుండా అక్కడే ఉండటంతో లోపలికి ట్రాక్టర్ వంటి వాహనాలు రాలేని పరిస్థితి. దీంతో అక్కడే ఒక చోట వరి ఓవులను కుప్పలుగా పెడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే ఇప్పటికీ ఎక్కడికక్కడే నీటిలో తేలుతున్న వరి ఓవులు దర్శనమిస్తున్నాయి. కంచిలి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 8,534 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 2130 ఎకరాల్లో వరి కోతలు చేపట్టడం జరిగింది. 580 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ పూర్తయ్యింది. మిగతా గ్రామాల్లో కోతలు కోసినవి ఇంకా మిల్లులకు తరలించలేదు. ఓవులుగానే పంట పొలాల్లో వర్షపు నీటిలో తేలుతున్నాయి. కర్తలి, సిర్తలి, మఠం సరియాపల్లి, కేసరపడ, ఎక్కల, అర్జునాపురం, రేఖాదేవిపురం, బెల్లుపడ, డోలగోవిందపురం, బైరిపురం, జలంత్రకోట, గోకర్ణపురం, శాసనాం గ్రామాల్లో వరి పంట నీటిలోనే ఉండిపోయింది. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సోంపేట మండలంలో..

సోంపేట: మండలంలో కోచిన వరిచేలు ఆదివారం నాటికి నీటిలోనే ఉన్నాయి. వర్షాలు తగ్గినప్పటికీ పొలాల్లో నీరుమాత్రం తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బెంకిలి, బారువ, పలాసపురం, గొల్లగండి, ఇస్కలపాలేం.రుషికుద్ద, మాకన్నపురం తదితర గ్రామాల్లో వరి పొలాల్లో నీరు ఉంది. నీటమునిగిన పంటను అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలకు నేలకొరిగిన వరి పంటను ఆదివారం పరిశీలించారు. పంట చేతికి వస్తున్న సమయంలో వర్షార్పణమైందని, వేలాది రూపాయలు అప్పులు చేసి పండించిన పంట నీటి పాలవ్వడంతో అన్నదాతలు కుదేలయ్యారని అన్నారు. తేమ శాతం, రంగు ధాన్యం పేరుతో రైతులను ఇబ్బంది చేయకుండా ప్రభుత్వం వెంటనే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక గోపీనాథపురం సమీపంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివారం రాత్రి సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కొంతమంది ఇంటర్మీడియెట్ నుంచే చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరస్తుల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ సునీత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుందాం

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. రామానుజన్ 137వ జయంతి సందర్భంగా మ్యాథ్స్‌డేను ఆదివారం జరుపుకున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మ్యాథ్స్‌డే అక్షర క్రమంలో విద్యార్థులు కూర్చొని ఆకట్టుకున్నారు. గణిత ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ తదితరులు


కంచిలి: చొట్రాయిపురం పాఠశాల రామానుజన్ జయంతిలో ద్యాన్స్ స్క్వేర్ కార్యక్రమంలో విద్యార్థులు


కవిటి ప్రభుత్వ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమిటీ ఛైర్మన్ మోహన్, హెచ్‌ఎం మల్లేశ్వరరావు


కవిటి:పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు


కాశీబుగ్గ: రామక్రిష్ణాపురంలో గణిత గుర్తుల ఆకారంలో విద్యార్థులు


కాశీబుగ్గ: కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు భీమారావుకు సత్కారం


ఇచ్ఛాపురం: జ్ఞానభారతి పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాలర్పిస్తున్న సిబ్బంది

డాక్టర్ క్రిష్ణమూర్తికి సత్కారం

కాశీబుగ్గ: పలాసకు చెందిన జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్ డాక్టర్ తెప్పల క్రిష్ణమూర్తికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన సకళ కళా ప్రదర్శణ కార్యక్రమంలో క్రిష్ణమూర్తికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, జ్ఞాపికను నిర్వాహకులు అందించి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించగా.. క్రిష్ణమూర్తి రచించిన నవలలు, రచనలు, నటించిన నాటికలను గుర్తిస్తూ ఈయన్ని గౌరవించారు.


క్రిష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం